W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

29-11-2025



06

## ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు 'జీవన సాఫల్య' పురస్కారం.

- భారత్ గౌరవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా వద్దిరాజుకు ప్రతిష్టాత్మక అవార్డు
- యువతకు అవకాశాలిస్తే దేశం ప్రగతిపథంలో దూసుకెళ్తుంది
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

## వాట్సాప్‌లో మెసేజ్.. మూడు రోజుల్లోనే పని ఖతం!

- ధరణిలో తిప్పలు.. భూభారతిలో పరిష్కారం
- మూడేళ్ల నిరీక్షణకు 72 గంటల్లో చెక్
- కలెక్టర్ చొరవతో ఎన్నారై సమస్య దూరం
- తహసీల్దార్ రాంప్రసాద్ పనితీరుపై ప్రశంసలు

ప్రభుత్వ పాలనలో వేగం పెరిగితే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో చెప్పడానికి ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ సంఘటనే తాజా ఉదాహరణ. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన ధరణి పోర్టల్ లో సాంకేతిక లోపాలు, అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడిపోయిన భూ సమస్యలు.. ఇప్పుడు కొత్త రెవెన్యూ విధానం 'భూభారతి'లో శరవేగంగా పరిష్కారమవు తున్నాయి.



07

## డిసెంబర్ 3న మహా ధర్నా!

- పుష్కర కాలంగా పరిష్కారం కాని జర్నలిస్టుల సమస్యలు
- మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావాలి

రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా జర్నలిస్ట్‌ల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంపై నిరసన వ్యక్తం చేస్తూ డిసెంబర్ 3న హైద్రాబాద్ లోని మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం ముందు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టేకోల రామ్ నారాయణ తెలిపారు.




02



ఖమ్మం బ్యూరో, మహా

09

# రాష్ట్రంపై స్క్రబ్ పంజా

### ఏజెన్సీ నుంచి సిటీ దాకా విస్తరించిన విష జ్వరాలు!

- అడవి బిడ్డలను వణికిస్తున్న విష జ్వరాలు
- ఆసుపత్రుల్లో పెరుగుతున్న సీరియస్ కేసులు
- పల్లెల్లో 'వింత జ్వరం'.. అసలు కారణం ఆ చిన్న కీటకమే!
- వ్యాధి ముదిరాక వస్తున్న బాధితులు..

తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల నుంచి పట్నం వరకు ఇప్పుడు ఒకటే ఆందోళన మొదలైంది. ఇన్నాళ్లూ కేవలం గిరిజన గూడేలకే పరిమితమైందని భావించిన 'స్క్రబ్ టైఫస్' ఇప్పుడు మైదాన ప్రాంతాలను, పట్టణాలను కూడా వణికిస్తోంది. వర్షాలు తగ్గి చలికాలం ప్రవేశిస్తున్న వేళ, రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలు విలయతాండవం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఇది సాధారణ జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేస్తుండటం, సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు వస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రులలకు క్యూ కడుతున్న బాధితుల సంఖ్యే ఈ వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది.

### మిస్టరీ ఫీవర్ కాదు.. ఆ చిన్న కీటకమే కారణం

ఈ వ్యాధి విషయంలో జరుగుతున్న ప్రధాన పొరపాటు 'అవగాహన లోపం'. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో దీనిని ప్రజలు 'వింత జ్వరం'గా లేదా 'మిస్టరీ ఫీవర్'గా పొరబడుతున్నారు. డెంగ్యూ, మలేరియా పరీక్షలు నెగెటివ్ వచ్చినా జ్వరం తగ్గకపోవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిజానికి స్క్రబ్ టైఫస్ వ్యాపించడానికి కారణమైన కీటకం (మైట్) కుట్టిన చోట శరీరంపై ఏర్పడే 'నల్లటి మచ్చ' ను గమనించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ మచ్చను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స చాలా సులభం. కానీ అది గమనించకుండా, జ్వరం ముదిరి మల్టీ ఆర్గాన్ వైఫల్యానికి దారితీస్తోంది.

### అప్రమత్తతే శ్రీరామరక్ష.. ప్రభుత్వ చర్యలు ముఖ్యం

ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే స్క్రబ్ టైఫస్‌ను గుర్తించే ర్యాపిడ్ టెస్ట్ కిట్లను అందుబా టులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తే తప్ప ఈ ముప్పు నుంచి ప్రజలను కాపాడలేం. జ్వరం వచ్చి తగ్గకపోతే అది స్క్రబ్ టైఫస్ కావొచ్చనే అనుమానంతో వైద్యం అందించాలని, వింత జ్వరమని భయపడవద్దని వైద్యారోగ్య శాఖ సూచిస్తోంది. ముఖ్యం గా వ్యవసాయా ధారిత జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం ఉన్నా, శరీరంపై నల్లటి మచ్చలు కనిపిస్తే వెంటనే పెద్ద ఆసుపత్రు లను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

FOLLOW: @ANNTELUGU
29-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## సంత మార్కెట్ వద్ద స్కూటీ-లారీ ఢీ

### ప్రమాదాలకు కారణం అస్తవ్యస్త రోడ్డులే: ప్రజలు



**అశ్వారావుపేట, మహా:** సంత మార్కెట్ సమీపంలో శుక్రవారం స్కూటీని వెనకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ డ్యామేజ్ కాగా ఎవరికి గాయాలు కాలేదు. సెంట్రల్ లైటింగ్ రోడ్ విస్తరణ పనులతో రహదారి పూర్తిగా అస్తవ్య స్తమైంది. గుంతలు, రాంగ్ రూట్‌లో వాహనాల రాకపోకలు, దుమ్ముదూళ్లతో కనిపిం చకపోవడం వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా వెళ్తున్న ఆటో సడన్ బ్రేక్ వేయడంతో స్కూటీ కూడా హఠాత్తుగా బ్రేక్ వేసింది. అదే సమయంలో నిర్లక్ష్యంగా వస్తున్న లారీ బ్రేకులు మోపినా కంట్రోల్ కాకపోవడంతో స్కూటీని ఢీకొట్టింది. దుమ్ముదూళ్లతో స్పష్టత లేకపోవడం, అధిక వేగం, నిర్లక్ష్య ప్రయాణమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనతో అక్కడ కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

## దేవాదాయ శాఖ కమిషనర్ ను కలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ఈఓ

**కూసుమంచి, మహా:** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, జీళ్ళచెరువు లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ కార్యనిర్వాహణాధికారి(ఈఓ) జగన్ మోహన్ రావు, జూనియర్ అసిస్టెంట్ మురళీ శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. హరీష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. హరీష్ ఇటీవలే కమీషనర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని పలు దేవాలయాలపై చర్చించారు. కమీషనర్ కు పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు.



## స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ



**ఖమ్మం,మహా:** జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛ, న్యాయబద్ధ నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు.సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు జరగడానికి ఆస్కారం ఇవ్వవద్దని, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ జరగాలని స్పష్టం చేశారు. ఎం.సి.సి. నిబంధనలు ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం కావద్దని తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.

# డిసెంబర్ 3న మహా ధర్నా!

- పుష్కర కాలంగా పరిష్కారం కాని జర్నలిస్టుల సమస్యలు
- మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావాలి
- ప్రెస్ మీట్ లో టీ యు డబ్ల్యూ జె (ఐ జె యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారాయణ
- పాల్గొన్న జిల్లా, రాష్ట్ర నాయకులు, జర్నలిస్టులు

**ఖమ్మం, మహా:** రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా జర్నలిస్ట్ ల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం పై నిరసన వ్యక్తం చేస్తూ డిసెంబర్ 3న హైద్రాబాద్ లోని మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం ముందు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టేకోల రామ్ నారాయణ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మైస పాపారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పుష్కర కాలంగా జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారంలో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని రామ్ నారాయణ ఆరోపించారు. మాటలకే పరిమితం అయ్యాయని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్ట్ ల సమస్య లను వెంటనే పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు అవుతున్నా మాటలతో కాలం




గడుపుతూ జర్నలిస్టుల సమస్యలును పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా లో ముగ్గురు మంత్రులు ఉన్న గాని, సమాచార శాఖ మంత్రి కూడా జిల్లాకు చెందిన వారు ఉన్నా గాని, జర్నలిస్ ల సమస్యలు పరిష్కారం విషయంలో మాటలకే పరిమితం అయ్యారని వాపోయారు. జర్నలిస్టు ల సమస్య లైన అక్రిడిటేషన్ కార్డులు మంజూరు, హెల్త్ కార్డుల పంపిణి, ఇంటి స్థలాలు కేటాయింపు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో జర్నలిస్ట్ లు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహా ధర్నా పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ ప్రెస్ మీట్ లో యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి జనార్ధన చారి, కోశాధికారి ఏలూరు వేణుగోపాలరావు, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, కోశాధికారి కళ్యాణ్, మేడి రమేష్, కెమెరా జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆలస్యం అప్పారావు, ఫోటో జర్నలిస్టుల అధ్యక్షుడు కమటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ



**ఖమ్మం, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ సెంటర్‌ను అదనపు డిసిపి (లా&అర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. రఘునాథపాలెం, కోయచిలక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ఫిలా టెలి ఎగ్జిబిషన్‌ని తిలకించిన స్మార్ట్ కిడ్జ చిన్నారులు



**ఖమ్మం సిటీ, మహా:** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు నగరంలోని ఎన్ఎస్పీ కాలనీలో ఉన్న డిబిఆర్సి భవన్ లో ఏర్పాటు చేసిన ఫిలా టెలి ఎగ్జిబిషన్ ను శుక్రవారం తిలకించారు. ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన ప్రాచీన పోస్టల్ స్టాంప్‌ల సేకరణను, ప్రాచీన నాణేలు, ప్రస్తుత నాణేలను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. పోస్ట్ కార్డులను, ఎన్వలప్ కవర్లను పరిశీలించారు. అనతి కాలం నుంచి మొదలుకొని ఇప్పటివరకు అందుబాటులో ఉన్న పోస్టల్ స్టాంపులు, నాణేలను తిలకించి వాటి వివరాలను సేకరించారు.

మహా పత్రిక
ANN తెలుగు



## కాంగ్రెస్ నేత బండ్ల సూర్యం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండ్ల సూర్యం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే, ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి ధైర్యం చెప్పి అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, శివ సైదులు, రహీం పాషా, కూచిపూడి బాబు, పాతూరి వెంకన్న, ఆవుల సర్వేశ్వరరావు, పి రాజు, బత్తుల శ్రీను తదితరులు ఉన్నారు.



## సారపాక సర్పంచ్ అభ్యర్థిగా ధారావత్ చందునాయక్ నామినేషన్

**బూర్గంపహాడ్ మహా:** మండల పరిధిలోని సారపాక గ్రామ పంచాయితీకి సర్పంచ్ అభ్యర్థిగా ధారావత్ చందునాయక్ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం సారపాక గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమే ధ్యేయంగా ముందు సాగుతానని తెలిపారు. తనను గెలిపిస్తే ఐదు ఏళ్ళ పాటు సారపాకను అభివృద్ధి చేస్తానని అన్నారు.

## జోరందుకున్న పంచాయతీ ఎన్నికల పర్వం: రెండో రోజు భారీగా దాఖలైన నామినేషన్లు

**ఖమ్మం,మహా:** ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. నామినేషన్ల స్వీకరణలో భాగంగా రెండో రోజైన గురువారం నాడు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసేందుకు పోటెత్తారు. జిల్లాలోని వివిధ మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ పడేందుకు ఆశావహులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆయా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అధికారుల అధికారిక లెక్కల ప్రకారం ఈ ఒక్కరోజే మొత్తం 157 సర్పంచ్ స్థానాలకు, 325 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. మండలాల వారీగా చూస్తే చింతకాని మండలంలో వార్డు సభ్యుల స్థానాలకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. ఇక్కడ అత్యధికంగా 85 వార్డు నామినేషన్లు దాఖలు కాగా, సర్పంచ్ స్థానాలకు 16 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్ పదవుల విషయానికి వస్తే ఎర్రుపాలెం మండలంలో గట్టి పోటీ నెలకొంది. ఇక్కడ సర్పంచ్ పదవి కోసం అత్యధికంగా 33 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, వార్డు సభ్యుల కోసం 39 మంది పోటీలో నిలిచారు. రఘునాథపాలెం, బోనకల్ మండలాల్లో కూడా వార్డు సభ్యుల స్థానాలకు ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. బోనకల్ లో 58, రఘునాథపాలెంలో 57 వార్డు నామినేషన్లు రాగా, సర్పంచ్ స్థానాలకు వరుసగా 22, 28 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక మధిర నియోజకవర్గ కేంద్రమైన మధిర మండలంలో 48 వార్డు సభ్యుల నామినేషన్లు, 27 సర్పంచ్ నామినేషన్లు వచ్చాయి. వైరా మండలంలో 28 వార్డు, 18 సర్పంచ్ నామినేషన్లు దాఖలు కాగా, కొనిజర్ల మండలంలో 10 వార్డు, 13 సర్పంచ్ నామినేషన్లు నమోదయ్యాయి. నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థులు తమ బలగంతో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా, ఎన్నికల అధికారులు నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించారు.

# పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు

## చిన్నాభిన్నం అవుతున్న పచ్చని సంసారాలు

## పేరుకే కిరాణా షాపులు..

## అడ్డగోలుగా మద్యం విక్రయాలు..

## పట్టించుకోని ఎక్సైంజ్ అధికారులు..

**నేలకొండపల్లి, నవంబర్ 28 మహా:** నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా యథేచ్ఛగా మద్యం వ్యాపారం కొనసాగుతుంది. బెల్ట్ దుకాణంల్లో జరుగుతున్న ఈ అక్రమ వ్యాపారానికి సంబంధిత అధికారుల అండదండలుండడంతో అడ్డు అదుపు లేకుండా ఈ మద్యం వ్యాపారం దందా మండలంలో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న మద్యం వ్యాపారులు ఈ దందాను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకొని కొనసాగిస్తున్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్ గా మరి మండలంలో మద్యం షాపుల నుండి బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తున్నారు. ఒక సీసా మద్యం వ్యాపారులు రూ20 అదనంగా తీసుకుంటుండగా బెల్ట్ షాపు నిర్వాహకులు మరో రూ 20 కలిపి రూ40 అదనంగా తీసుకుని మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. నెలకొండపల్లి మండల కేంద్రంలోని గ్రామాల్లో అడుగడుగునా మద్యం షాపులు ఉన్నాయి. అయితే ఈ దుకాణలు తెరవకముందు మూసిన తర్వాత మద్యం ప్రియులంతా బెల్ట్ షాపులను ఆశ్రయిస్తున్నారు.గ్రామాల్లో కిరాణా షాపులు, హెూటల్లు పేరుకే ఉన్నప్పటికీ లోపల తతంగమంతా ఈమధ్యం విక్రయాలే నడిపిస్తున్నారు. మద్యం విక్రయంతో పాటు అక్కడ తాగేందుకు బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం ప్రియుల కోసం వెజ్,నాన్ వెజ్ ఐటమ్స్ ను క్షణల్లో అందిస్తుండడంతో వారు ఈ బెల్ట్ దుకాణాలల్లో మద్యం సేవించేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీంతో వ్యాపారులు వీటిని ఆసరాగా చేసుకొని ఎలాంటి అనుమతులు లేనప్పటికీ అన్ని ఏర్పాట్లతో దర్జాగా విక్రయాలు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.ప్రభుత్వ అనుమతి కలిగిన మద్యం దుకాణాల నిర్వాహకు సమయపాలనలో నిబంధన ఉంది. ఈ నిబంధనల ప్రకారం దుకాణాన్ని తొందరగా తెరవడం.. ఆలస్యంగా మూయడం వంటివి చేయవద్దు.. కానీ ఎనీ టైం మద్యం దొరికేది ఒక బెల్ట్ దుకాణంల్లోనే.. మద్యం దుకాణాలున్న మండల కేంద్రంలోని వాటిని మూయగానే బెల్ట్



దుకాణాలల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో వీటి ప్రభావం మరింత అధికంగా ఉంటుంది. బెల్ట్ దుకాణాలలో అదనంగా రూ. 40 వసూలు

### ఇబ్బంది పడుతున్న మహిళలు

గ్రామాల్లో అక్రమంగా వెలిసిన బెల్ట్ దుకాణాల వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం సేవించిన మత్తులో బెల్ట్ దుకాణాల వైపు వెళు తున్న మహిళలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. యువత, ప్రజలు మధ్యానికి బానిసవుతున్నారు. ఈ బెల్టు దుకాణాల వల్ల చెడు మార్గాలు పడుతున్నట్టు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చని సంసారంల్లో బెల్ట్ దుకాణాలు చుచ్చు పెడుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ దుకాణాలపై అధికారులు కోరడా జూలిపించాలని పలువురు మహిళలు అధికారులను కోరుకుంటున్నారు.

### యువతపై తీవ్ర ప్రభావం

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అందుబాటులో మద్యం దొరుకుతుంది. దీనివల్ల యువత మద్యానికి బానిసై భవిష్యత్తులను నాశనం చేసుకుంటున్నారు. చెడు మార్గాల వైపు వెళ్తుతున్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం మద్యం తాగి వాహనాలను నడపడమే కారణంగా పోలీసులు పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇంకా ఎన్నో అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని పలువురు మేధావులు అంటున్నారు.

## మాల యోధుల ఆర్థిక సాయం



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలలో నివసిస్తున్న మాల సామాజిక వర్గాన్ని బలోపేతం చేయడానికి మాల మల్ల యోధులు పేరుతో ఐక్యవేదికను ఏర్పాటుచేసి ఇబ్బందుల్లో ఉన్న మాల కుటుంబాలను సందర్శించి, పరామర్శిస్తున్నారు. ఈ దిశగా కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలో అనారోగ్య సమస్యలతో చిన్న వయసులో అకాల మరణం పొందిన నక్క బ్లేస్సి (18సం”) కుటుంబాన్ని పరామర్శించి తల్లి నక్క సుజాతకు 10200 రూపాయలు, 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాల యోధుడు బి.వి మాట్లాడుతూ మాల సామాజిక వర్గంలో ఐక్యత లోపించిందని దానిని పునరుద్ధీకరించడానికి మాలల ఐక్యవేదిక ఏర్పాటు చేసి దాని ద్వారా ఆర్థికంగా బలహీనంగా ఉండి ఇబ్బందులకు గురైన కుటుంబాలకు బాసటగా నిలవాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి మల్లికార్జున్, బి.రామారావు, విజయ్, గురవయ్య పలువురు మాల మల్ల యోధులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించండి



**ఖమ్మం సిటీ, మహా:** ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న సిపిఎం పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు లు కోరారు. శుక్రవారం సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ పార్క్ నుండి ఎఫ్సీఐ గుట్ట మీద నుండి ప్రకాష్ నగర్ శ్రీనివాస్ నగర్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస రావులు మాట్లాడుతూ 17,27,28,29,30 వ డివిజన్ల లో రోడ్డు విస్తరణలో భాగంగా చాలామంది నిరుపేదల ఇండ్లు తీసివేస్తామని చెప్పి తొలగిస్తామని చెప్పి స్థానిక కార్పొరేటర్లు మరియు కాంట్రాక్టర్లు ప్రజలను భయాందోళన గురి చేస్తున్నారు అని ఆరోపించారు.

## కేసీఆర్ ఉద్యమ పోరాటం



**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన దీక్ష దివస్ ఉద్యమం ఈ తరం మాత్రమే కాదు, రాబోయే తరాలు కూడా స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఉద్యమానికి కొత్త దిశ ఇచ్చిన మహోన్నత ఘట్టం దీక్ష దివస్ అని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ధ్యేయంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసిఆర్, “తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో” అంటూ నినాదంతో 29 నవంబర్ కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్, రాష్ట్ర ప్రజల కలల్ని నిజం చేసిన ప్రజా పోరాట దినంగా నిలిచిపోయిందన్నారు. దశాబ్దాలుగా అందని తెలంగాణ స్వప్నానికి కేసీఆర్ చూపిన అహింసాయుత పోరాట మార్గం తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా అడుగులు వేసిందన్నారు.



# జనవరి 1న మావోల సామూహిక లొంగుబాటు!

- దండకారణ్యంలో దడ పుట్టించిన ‘ఆపరేషన్ కగార్’..
- తుపాకీ గొట్టం నుంచి శాంతి మార్గం వైపు.
- హిడ్మా అంతంతో కుప్పకూలిన మనోధైర్యం..
- ఆపండి కాల్పులు.. వస్తాం జనజీవన స్రవంతిలోకి..
- కేంద్రానికి మావోల లేఖ!
- పోలీసుల చెరలో అగ్రనేత దేవ్ జీ?
- వీడని మిస్టరీ.. కోర్టు మెట్లెక్కిన వివాదం!

### మారేడుమిల్లి ఎన్‌కౌంటర్..

ముఖ్యంగా నవంబర్ 18న ఆంధ్రప్రదేశ్ లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తీసింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో అత్యంత కీలకమైన వ్యక్తిగా, గెరిల్లా యుద్ధ తంత్రంలో దిట్టగా పేరున్న హిడ్మా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించడం ఆ పార్టీకి తీరని లోటుగా మారింది. హిడ్మాతో పాటు మరో ఆరుగురు అగ్రశ్రేణి నాయకులు నేలకొరగడం ఆ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టివేసింది. నాయకులే దిక్కులేని స్థితిలో ఉంటే, ఇక సామాన్య దళ సభ్యుల పరిస్థితి ఏంటన్న ఆందోళన దళాల్లో మొదలైంది

### జనవరి 1న సంచలన లొంగుబాటు?

ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడే మార్గం లేక, మావోయిస్టు అగ్రనాయకత్వం ఒక సంచలన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయుధాలతో పోరాటం చేసి ప్రాణాలు పోగొట్టుకోవడం కంటే, ప్రభుత్వానికి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడమే మేలని వారు భావించారు. ఈ మేరకు ఎంఎంసీ జోన్ మావోయిస్టు ప్రతినిధి అనంత్ పేరుతో విడుదలైన లేఖలో వారి నిస్సహాయత, రాజీ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. పదిహేను రోజుల క్రితం “మాకు ఆలోచించుకోవడానికి సమయం కావాలి” అని కోరగా, ఇప్పుడు “జనవరి 1న సామూహికంగా లొంగిపోతాం” అని స్పష్టమైన ప్రకటన చేశారు.

**ఖమ్మం బ్యూరో, మహా:** భారత అంతర్గత భద్రతా చరిత్రలో ఒక సుదీర్ఘ శకం ముగియబోతోందా? దశాబ్దాలుగా అడవి బిడ్డల ఆవేదన పేరుతో, విప్లవ నినాదాలతో దండకారణ్యాన్ని ఎర్రబారేలా చేసిన సాయుధ పోరాటం ఇక చరిత్ర పుటల్లో కలిసిపోనుందా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం బలంగా వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా, ఉక్కుపాదంతో అమలు చేసిన ‘ఆపరేషన్ కగార్’ మావోయిస్టు పార్టీ పునాదులను కదిలించింది. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని ఇన్నాళ్లు బలంగా నమ్మిన మావోయిస్టులు, ఇప్పుడు ప్రాణభయంతో, ఉనికిని కాపాడుకునే పోరాటంలో వెనుకబడిపోయారు. అగ్రనేతల వరుస ఎన్‌కౌంటర్లు, కీలక సానుభూతిపరుల అరెస్టులు, షెల్టర్ జోన్ల ధ్వంసంతో మావోయిస్టు పార్టీ దిక్కుతోచని స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే తమ సాయుధ పోరాటానికి స్వస్తి పలికి, జనవరి 1న సామూహికంగా లొంగిపోతామని మావోయిస్టులు ప్రకటించడం, అదే సమయంలో తమ అగ్రనేతలు పోలీసుల అదుపులో ఉన్నారంటూ ఆరోపించడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనల వెనుక ఉన్న అసలు వాస్తవాలేమిటి? దండకారణ్యంలో అసలేం జరుగుతోంది?

### మావోయిస్టు కోటల్లో ప్రకంపనలు..
### ‘ఆపరేషన్ కగార్’ ఉక్కుపాదం

కేంద్ర హోం శాఖ మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా చేపట్టిన ‘ఆపరేషన్ కగార్’ ఇప్పుడు అత్యంత నిర్ణయాత్మక దశకు చేరుకుంది. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటలుగా, అభేద్యమైన దుర్గాలుగా ఉన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) జోన్‌లలో భద్రతా బలగాలు పకడ్బందీగా వల పన్నాయి. అత్యాధునిక డ్రోన్ల నిఘా, కచ్చితమైన ఇంటెలిజెన్స్ సమాచారం, కోబ్రా దళాల మెరుపు దాడులతో మావోయిస్టులకు అడవిలో కనీసం తలదాచుకునే స్థలం కూడా లేకుండా చేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో కేంద్ర బలగాలు జరిపిన భీకర దాడులను తట్టుకోలేక మావోయిస్టు దళాలు చెల్లాచెదురయ్యాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాల కోసం వెతుకుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లోకి ప్రవేశించిన మావోయిస్టులకు ఇక్కడి గ్రేహౌండ్స్ మరియు ప్రత్యేక పోలీసు బలగాలు కూడా ఊహించని షాక్ ఇచ్చాయి.

## సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటిన ఎక్సెంట్ విద్యార్థులు



**మణుగూరు, మహా:** భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని సెయింట్ మేరీ పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వ హిం ఓచిన సైన్స్ ఫెయిర్‌లో ఎక్సెంట్ విద్యార్థులు తమ ప్రాజె క్టులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇది 53వ రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన (హెచ్ఎస్‌బీవీపీ) 2025- 26 కార్యక్రమాలలో భాగంగా నిర్వహించారు. వివిధ విభాగాలలో పాల్గొన్న ఎక్సెంట్ విద్యార్థులు విజయపతాకాన్ని ఎగురవేశారు. విభాగాలవారీగా విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసైక్లింగ్ ఆఫ్ ప్లాస్టిక్, సీనియర్ విభాగంలో ప్లాస్టిక్ రోడ్ ప్రాజెక్టుతో విద్యార్థులు త్రిహిత్, జయన్ విజ్వల్, యోగేష్‌లు రెండవ స్థానం సాధించారు.

## ఆసుపత్రుల్లో అస్తవ్యస్తం



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ తీరుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలాజీనగర్ లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు విఫలమయ్యాయని, రోగుల భద్రతను గాలికి వదిలేశారని మండిపడ్డారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖమ్మం పట్టణంలోని బాలాజీనగర్ లో ఉన్న ‘సాయి డెంటినోవా హాస్పిటల్’, ‘శ్రీ వెంకటేశ్వర క్లినిక్’ లలో డి.ఎం.హెచ్.ఓ డా. డి. రామారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఆసుపత్రులు నడుస్తున్నాయా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అక్కడి పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు రోగుల నుండి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు, వైద్య సేవల రేట్లు, వైద్యుల వివరాలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా గోడలపై ఉంచాలని నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో ఆసుపత్రులు నిర్లక్ష్యం వహిస్తున్నాయని గుర్తించారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డిసెంబర్ 2న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను సంబంధిత శాఖల ఇంజనీరింగ్ రోడ్లు భవనాలు విద్యుత్ పోలీస్ శాఖ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పనుల పురోగతి భద్రతా చర్యలు నిర్వహణ వంటి అంశాలపై అధికారుల నుండి వివరణలు కోరారు. శిలాఫలకం ఏర్పాటు ఆవరణ అభివృద్ధి అంతర్గత రోడ్ల మరమ్మత్తులు సందర్శకుల కోసం ఏర్పాటు చేయాల్సిన మార్గదర్శక బోర్డులు పార్కింగ్ స్థలాలు స్టేజీ నిర్మాణం విద్యుత్ సౌకర్యాల తనిఖీ వంటి అంశాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ లోటుపాట్లు ఏవైనా ఉన్న వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగినదని అన్ని శాఖలు



పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటడం ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు శానిటేషన్ ఏర్పాట్లు పూర్తి చేసి ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పర్యటన రూట్‌మ్యాప్ తుది రూపు, ట్రాఫిక్ సర్దుబాట్లు, అగ్నిమాపక చర్యలు, వైద్య బృందాల నియామకం, వీఐపి ప్రోటోకాల్ అమలు వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ముక్కోటి ఏర్పాట్లు చేయండి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 29న నిర్వహించు తెప్పోత్సవం, 30న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం కళ్యాణ మండపం అధ్యయన వేదిక క్యూ లైన్‌లు భక్తుల కోసం సెక్టార్ వైజ్ ఏర్పాట్లు వంటి అంశాలపై దేవస్థానం అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. మిథిలా స్టేడియం ఉత్తర ద్వారం ప్రాంతంలో క్యూ లైన్‌ల ఏర్పాటు భక్తుల ప్రవేశ నిష్క్రమణ మార్గాలు భద్రతా బలగాల మోహరింపు త్రాగునీరు వైద్య సేవలు శానిటేషన్ మొబైల్ టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలను కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి చేరుకునే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం లేకుండా చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్య విభాగం 24 గంటలు అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఉత్తర ద్వారం వద్ద బారికేడింగ్, క్యూ లైన్ కవర్లు, లైటింగ్, సీసీ కెమెరాలు, సమాచార ప్యానెల్స్ ఏర్పాటు వంటి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవానీ, రామకృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల షెడ్యూల్లో బీసీలకు అన్యాయం



**టేకులపల్లి - మహా:** టేకులపల్లి: రాష్ట్రాన్ని క కమిషన్ విడుదల చేసిన స్థానిక ఎన్నికల షెడ్యూల్ లో జనరల్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని టేకులపల్లి మండలం బీసీ సంఘం కన్వీనర్ లక్కినేని సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి వద్ద అత్యవసరంగా ఏర్పాటుచేసిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ టేకులపల్లి మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో జనరల్, వార్డులను ఎస్టీలకు, ఎస్టి వార్డులను జనరల్ అభ్యర్థులకు కేటాయించారాని అన్నారు. అంతేకాక జనరల్ స్థానాలు కావడం వలన ఎస్టీలు కూడా అ వార్డులకు పోటీ చేసే అవకాశం ఉన్నందున జనరల్ అభ్యర్థులు పోటీ చేసిన గెలిచే అవకాశం లేదని వాపోయారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని జనరల్ అభ్యర్థులకు న్యాయం చేసేందుకు అన్ని పార్టీల అగ్ర నాయకులు ఆలోచించాలని కోరారు. జనరల్ స్థానాలలో జనరల్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నిక చేయాలని ఆయన కోరారు. శనివారం నాడు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి వద్ద బీసీ సంఘం, మైనార్టీ ,ఓసి సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల గురించి అన్ని కుల సంఘాల నాయకులతో చర్చించి తదుపరి కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నర్సింగ్ లక్ష్మయ్య తవుడోజు బిక్షమయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, సింగం చినరాజేశ్వరరావు, మావు నూరి రమేష్, మావునూరి రాజు, ఆరెళ్ళ రాజు కే సురేష్ చిర్ర వెంకటయ్య, మెంతేన ప్రభాకర్, మంతెన సంజీవరావు, నెల్లూరి ప్రకాష్, ఆమెడ రేణుక, కరదుల వీరన్న, తదితరులు పాల్గొన్నారు

# అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు సెంట్రల్ కోయిర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సందర్శన









**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు శాస్త్రీయ అధ్యయన యాత్రలో భాగంగా కేరళలోని అల్లాపుజా జిల్లా, కలవూర్ ప్రాంతంలో ఉన్న సెంట్రల్ కోయిర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ను సందర్శించారు. సంప్రదాయ పరిశ్రమల ఆధునికీకరణ, తాడి ఫైబర్ (కోయిర్) తయారీ సాంకేతికత, విలువ ఆధారిత ఉత్పత్తుల రూపకల్పనపై సంస్థ పరిశోధకులు కీలక అంశాలను వివరించారు. తాడి పీచు నుంచి మెట్రస్‌లు, మ్యాట్లు, తాడులు, జియోటెక్స్టైల్ ఉత్పత్తులు తయారీ విధానాన్ని ప్రాక్టికల్ డెమో రూపంలో చూపించగా విద్యార్థుల్లో ఆసక్తి నెలకొంది. తాడి పరిశ్రమకు దేశీయంగా మరియు విదేశాల్లో ఉన్న డిమాండ్, మార్కెట్ విస్తరణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలపై కూడా సంస్థ శాస్త్రవేత్తలు విశ్లేషణాత్మకంగా వివరించారు. సందర్శనలో 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చదువుతో పాటు పరిశ్రమల ప్రాక్టికల్ అవగాహన పెంపు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఈ విద్యా యాత్రను డాక్టర్ కె. శిరీష, డాక్టర్ టీ. శ్రవణ్ కుమార్, డాక్టర్ డి. శ్రావంతి, డాక్టర్ ఏ. శ్రీజన్ పర్యవేక్షించారు.

# ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు జీవన సాఫల్య పురస్కారం

- భారత్ గౌరవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా వద్దిరాజుకు ప్రతిష్టాత్మక అవార్డు
- యువతకు అవకాశాలిస్తే దేశం ప్రగతిపథంలో దూసుకెళ్తుంది
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




**ఖమ్మం, మహా:** న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'భారత్ గౌరవ్ ఫౌండేషన్' బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను 'జీవన సాఫల్య పురస్కారం'తో గౌరవించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో గల అవాసా హోటల్‌లో జరిగిన ఫౌండేషన్ 8వ వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపీ వద్దిరాజుకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురస్కారాన్ని స్వీకరించిన అనంతరం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సభనుద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, తన పదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కేసీఆర్ మార్గనిర్దేశనంలో అప్పటి మంత్రి కేటీఆర్.. హైదరాబాద్‌ను అమెరికాలోని న్యూయార్క్, డల్లాస్, చికాగో నగరాలకు దీటుగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలోనే హైదరాబాద్ ఐటీ, ఫార్మా హబ్‌గా రూపుదిద్దుకుందని, ఇక్కడి నుంచి ఎంతోమంది ఎదిగి పలు విదేశాల్లో ఉన్నత పదవులను అధిష్ఠించి సేవలు అందిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. మన దేశంలో అపారమైన యువ సంపద ఉందని, యువశక్తికి ఏమాత్రం కొదవలేదని ఎంపీ వద్దిరాజు తెలిపారు. 40 ఏళ్లలోపు వయసున్న వారు కోట్లాది మంది ఉన్నారని, మొన్న ఖమ్మంలో జరిగిన సర్దార్ పటేల్ 'యూనిటీ రన్' సందర్భంగా ఇదే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. యువతకు సరైన అవకాశాలు కల్పిస్తే, వారి శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుంటే దేశం ప్రగతిపథంలో మరింత వేగంగా పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా తాను విద్య, వైద్యారోగ్య రంగాల ఉన్నతికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తన వంతు నిరంతర కృషి చేస్తానని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఫౌండేషన్ నిర్వాహకులు సందేశ్ యాదవ్, వారి బృందాన్ని ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్, త్రిదండి చినజీయర్ స్వామి, ఒలింపిక్ ఛాంపియన్ సైనా నెహ్వాల్, ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు నిర్వాహకులు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** క్రీడాకారులు గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తితో సమానముగా స్వీకరించాలని సింగరేణి డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు మూడు రోజులపాటు నిర్వహించే కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సింగరేణి డైరక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను సింగరేణి కొత్తగూడెం ఏరియా నిర్వహించుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని క్రీడలు అనేవి శారీరక దృడత్వానికి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఈ క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానముగా తీసుకోవాలని కోరారు.

## నామినేషన్ కేంద్రాల తనిఖీ..



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, పినపాక మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించారు. రెండు మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించిన ఆమె, అభ్యర్థులు మార్గదర్శకాలకు అనుగుణంగా పత్రాలు సమర్పిస్తున్నారా అనే అంశంపై సూక్ష్మంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకురాలు లావణ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతి ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల వ్యయాలు పూర్తిగా పారదర్శకంగా, నియమ నిబంధనలకు లోబడి ఉండాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులతో సమన్వయంతో మిగిలిన నామినేషన్ ప్రక్రియను కూడా పర్యవేక్షిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, పినపాక తహసీల్దార్ గోపాలకృష్ణ, జిల్లా ఎన్నికల శాఖ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా శ్రీనివాస కళ్యాణం పోస్టర్ ఆవిష్కరణ



**సత్తుపల్లి, మహా:** ధనుర్మాసం సందర్భంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఇంటింటా శ్రీనివాస కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇంటింటా శ్రీనివాస కళ్యాణం పోస్టర్ లను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన ధనుర్మాసంలో భక్తుల ఇళ్లలోనే కళ్యాణం నిర్వహించడం గొప్ప విషయం అంటూ ఆలయ ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆలయ ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ డిసెంబర్ 16 వ తేదీ నుండి జనవరి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు రాగాల చంద్ర రెడ్డి, ద్రోణంరాజు మల్లిఖార్జున శర్మ, గాదె నాగు, తోట కిరణ్, రమేష్ రెడ్డి, విష్ణు రెడ్డి, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అశ్వారావుపేట పోలీసులు





**అశ్వారావుపేట, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ జరగనున్న నేపథ్యంలో అశ్వారావుపేట మండల పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పోలీసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై అఖిల సిబ్బందితో కలిసి భద్రతా చర్యలు, క్యూలైన్ వ్యవస్థ, వాహనాల పార్కింగ్, ప్రజా రద్దీ నియంత్రణ వంటి ఏర్పాట్లను కేంద్రాల్లో పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. మండలంలో నారంవారిగూడెం కాలనీ, జమ్మిగూడెం, ఊట్లపల్లి, అనంతారం, వినాయకపురం, తిరుమలకుంట, నందిపాడు, కన్నాయిగూడెం, తదితరంగా ఏర్పాటు చేసిన మొత్తం 8 నామినేషన్ కేంద్రాలను పోలీసులు వరుసగా తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎటువంటి ఉద్రిక్తతలు లేకుండా జరగేందుకు అందరూ సహకరించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని (మోడల్ కోడ్) పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సమస్యలు, అవాంతరాలు లేదా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే డయల్ 100 సేవను వినియోగించాలని సూచించారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**నేలకొండపల్లి, మహా:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు టీఎస్ యూటీఫ్ జిల్లా కార్యదర్శి కట్ట పద్మ పేర్కోన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా విస్తృత సమావేశాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యమాలు ఉధృతం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యారంగ పరిణామాలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం మార్గాలు లక్ష్యంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కోన్నారు. ఈ నెల 30 న కల్లూరు లో జరిగే జిల్లా కమిటి విస్తుత సమావేశం లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు జ్యోతి. ప్రధాన కార్యదర్శి తొర్తి గురవయ్య .రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గొందిగూడెం నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ..



**అశ్వాపురం.మహా:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అశ్వాపురం మండలంలో ఎన్నికల సందడి మొదలైంది. మండల పరిధిలోని గొంది గూడెం లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకున్న భద్రతా చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి , ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.



## రెండవ రోజు సర్పంచ్‌కు13 నామినేషన్లు

**పినపాక,మహా:** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల జోరు కొనసాగింది. రెండో రోజు శుక్రవారం కూడా అభ్యర్థులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రాలకు చేరుకొని నామినేషన్‌లు దాఖలు చేశారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు గాను వివిధ పార్టీలకు సంబంధించి 13 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులుగా 21 మంది నామినేషన్ దాఖలు చేశారు. వార్డ్ మెంబర్లుగా 17 గ్రామ పంచాయతీల నుంచి 123 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ కేంద్రాల వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. అభ్యర్థులు అవసరమైన ధృవపత్రాలతో నామినేషన్‌లు దాఖలు చేయగా, ఎన్నికల అధికారులు విధిగా పత్రాలను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతల కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో నామినేషన్ల ప్రక్రియ నేటితో ముగుస్తుందని అధికారులు తెలిపారు.

# వాట్సాప్‌లో మెసేజ్.. మూడు రోజుల్లోనే పని ఖతం!

- ధరణిలో తిప్పలు.. భూభారతిలో పరిష్కారం
- మూడేళ్ల నిరీక్షణకు 72 గంటల్లో చెక్
- కలెక్టర్ చొరవతో ఎన్నారై సమస్య దూరం
- తహసీల్దార్ రాంప్రసాద్ పనితీరుపై ప్రశంసలు



**ఖమ్మం, మహా:** ప్రభుత్వ పాలనలో వేగం పెరిగితే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో చెప్పడానికి ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ సంఘటనే తాజా ఉదాహరణ. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన ధరణి పోర్టల్‌లో సాంకేతిక లోపాలు, అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడిపోయిన భూ సమస్యలు.. ఇప్పుడు కొత్త రెవెన్యూ విధానం 'భూభారతి'లో శరవేగంగా పరిష్కారమవుతున్నాయి. జిల్లా కలెక్టర్, తహసీల్దార్ సమన్వయంతో పనిచేసి ఓ ఎన్నారై మూడేళ్ల సమస్యను కేవలం మూడు రోజుల్లో పరిష్కరించి ఔరా అనిపించారు. పుట్టిన గడ్డపై మమకారంతో భూమి కొనుగోలు చేసిన ఓ ప్రవాస భారతీయుడికి , రెవెన్యూ చిక్కుల వల్ల గత మూడేళ్లుగా ఎదురైన ఇబ్బందులు ఎట్టకేలకు తొలగిపోయాయి. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక చొరవ, తహసీల్దార్ రాంప్రసాద్ వేగవంతమైన పనితీరుతో బాధిత ఎన్నారైకి 'భూభారతి' ద్వారా పట్టా పాస్ పుస్తకం లభించింది. విషయంలోకి వెళితే.. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన పసుపులేటి రాజగోపాల్ అమెరికాలో స్థిరపడ్డారు. ఆయనకు ఏదులాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 19లో ఒక గుంట, సర్వే నంబర్ 20లో 31 గుంటలు, అలాగే సర్వే నంబర్ 327లో 20 గుంటల విస్తీర్ణంలో భూమి ఉంది. ఈ భూములకు సంబంధించి పాస్ పుస్తకం పొందేందుకు ఆయన 2022లోనే ఎన్నారై పోర్టల్ ద్వారా అప్పటి ధరణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అప్పట్లో అధికారుల పట్టింపులేనితనం వల్ల ఆ దరఖాస్తు తహసీల్దార్ లాగిన్‌లోనే నిలిచిపోగా, పరిష్కారం కోసం రాజగోపాల్ కార్యాలయాల చుట్టూ తిరగలేక తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సుదీర్ఘకా లం వేచిచూసిన రాజ గోపాల్, ప్రస్తుత ప్రభుత్వం లోనైనా న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో నేరుగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి తన సమస్యను వివరిస్తూ వాట్సాప్‌లో సందేశం పంపారు. దీనిపై తక్షణం స్పందించిన కలెక్టర్, పెండింగ్ దరఖాస్తును వెంటనే పరిష్కరించాలని రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను సవాలుగా తీసుకున్న తహసీల్దార్, తన లాగిన్‌లో ఉన్న దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. అమెరికాలో ఉన్న రాజగోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న వారి బంధువు వెంపటి సురేందర్ ద్వారా అవసరమైన పత్రాలను తెప్పించుకుని, పూర్తి విచారణ జరిపి కేవలం మూడు రోజుల్లోనే నూతన పాస్ పుస్తకాన్ని ముద్రించారు. సిద్ధమైన పాస్ పుస్తకాలను శు క్రవారం తహసీల్దార్ తన కార్యాలయంలో సురేందర్‌కు అందజేశారు. మూడేళ్లుగా నలుగుతున్న సమస్య మూడు రోజుల్లో పరిష్కారం కావడం పట్ల ఎన్నారై రాజగోపాల్ సంతోషం వ్యక్తం చేశారు. సాంకేతికతను వాడుకుని ప్రజా సమస్యలను పరిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి, తహసీల్దార్ రాంప్రసాద్‌కు వాట్సాప్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

## సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



**నేలకొండపల్లి, నవంబర్ 28 మహా:** సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మండలంలోని రాయిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న బెల్లంకొండ సత్యనారాయణ మాధవి దంపతులు 18,500 రూపాయలు విలువ గల సౌండ్ సిస్టంను పాఠశాల సౌకర్యార్థం ప్రధానోపాధ్యాయులు బి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సౌండ్ సిస్టం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సాంస్కృతిక కళా రూపాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు బెల్లంకొండ సత్యనారాయణ మాధవి దంపతులను స్ఫూర్తిగా తీసుకొని పాఠశాల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంతరమోని నాగార్జున, జి రాజు, పి నాగేశ్వరరావు, బి నాగేశ్వరరావు, టి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సరిహద్దు చెక్ పోస్టులు ఏ.సి.పి ఆకస్మిక తనిఖీ



**సత్తుపల్లి,నవంబర్ 28: మహా:** ఎన్నికల నియమావళి చేరువ అవడంతో నియోజకవర్గ పరిధిలోని ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ (ఐ.పీ.ఎస్) ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ బృందం పనితీరు, వాహనాల తనిఖీలు, సిబ్బంది కేటాయింపులు, వీడియోగ్రఫీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్ పోస్టులలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అప్రమత్తంగా నిర్వహించాలని, తనిఖీల సమయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే తక్షణమే స్పందించాలని ఎస్.ఎస్.టి బృందాలను ఆదేశించారు.

# మోడల్ డెమో ఫామ్ రైతులకు మార్గదర్శకంగా మారాలి



**బూర్గంపహాడ్ మహా:** మోడల్ డెమో ఫామ్ రైతులకు మార్గదర్శకంగా మారాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలో వ్యవసాయ ఆధారిత బహుముఖ ఆదాయ వనరులను గ్రామస్తులకు చేరువ చేయడం లక్ష్యంగా రూపొందించిన మోడల్ డెమో ఫామ్ ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహంపై దృష్టి సారించి రూపొందించిన ఈ మోడల్ డెమో ఫామ్ జిల్లా స్థాయిలో ఒక ఆదర్శ ప్రదర్శనగా నిలుస్తోందన్నారు. నిరుపయోగంగా ఉన్న భూములను సక్రమ ప్రణాళికతో వినియోగిస్తే గ్రామీణ కుటుంబాలకు సిద్ధమైన ఆదాయ వనరులు సృష్టించడం సాధ్యమవుతుందని తెలిపారు. మోరంపల్లిబంజర్ గ్రామంలో 15 గుంటల నిరుపయోగ భూమిని ఉపయోగించి కూరగాయల సాగు, బంతిపూల పెంపకం, చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం వంటి పలు విభాగాలను సమగ్ర ప్రదర్శన రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులు, మహిళా సంఘాలు, యువతకు ప్రత్యక్ష అవగాహన కల్పించడానికి ఈ మోడల్ ఫామ్ ఉపయోగంగా ఉండాలని తెలిపారు.

మహా పత్రిక
ANN తెలుగు

# పల్లెల్లో మళ్ళీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు

- బీఆర్ఎస్, సీపీఎం పొత్తు చారిత్రాత్మకం..
- 21 పంచాయతీల్లోనూ మనదే విజయం
- సర్వేలు చూసి కాంగ్రెస్ నేతల్లో వణుకు..
- మట్టికి పోయిన ఇంటోడు ఉండాలి.. ఇప్పుడున్నది పరాయి పాలన.
- పాలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కందాల ఉపేందర్ రెడ్డి

**ఖమ్మం రూరల్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని పాలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కందాల ఉపేందర్ రెడ్డి విమర్శించారు. ప్రజలు ప్రస్తుతం ఏ పల్లెలో చూసినా తిరిగి కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం రూరల్ మండలంలో బీఆర్ఎస్, సీపీఎం పార్టీల మధ్య జరిగిన కీలక సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఖమ్మం రూరల్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన శుక్రవారం బీఆర్ఎస్, సీపీఎం పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. రానున్న పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, పాలేరు డివిజన్ సీపీఎం కార్యదర్శి బండి రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కందాల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, సమాజంలోని అన్ని వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. పాలేరు నియోజకవర్గంలో ప్రస్తుతం పరాయి పాలన కొనసాగుతుందని, ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు.. ప్రజలను మనుషులుగా చూడటం కూడా మరిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మన పెద్దలు చెప్పినట్లు 'మట్టికి పోయిన ఇంటోడు ఉండాలి' అని, కానీ ప్రస్తుతం పాలేరులో ఆ పరిస్థితి లేదని, దీనికి తగిన బుద్ధి చెప్పాలంటే రూరల్ ప్రజలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో రూరల్ మండలంలో బీఆర్ఎస్, సీపీఎం కలయిక చారిత్రాత్మకమని కందాల అభివర్ణించారు. ఈ పొత్తుతో మండలంలోని 21కి 21 పంచాయతీల్లో జయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికార పార్టీ చేయించుకున్న అనేక సర్వేలలో ప్రతికూల ఫలితాలు రావడంతో కాంగ్రెస్ నాయకుల్లో భయం పట్టుకుందన్నారు. సర్వే రిపోర్టులు రాకముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన ఆ పార్టీ నేతలు, ఇప్పుడు రిపోర్టులు చూసి బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలంటే, నాటి అభివృద్ధిని, నేటి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్–సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. నామినేషన్లు వేయబోయే అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని, ఇరు పార్టీల నాయకులు నిత్యం సమన్వయంతో మెలిగి సంపూర్ణ విజయం సాధించాలని కోరారు. అనంతరం సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేశ్ మాట్లాడుతూ, సీపీఎం మరియు బీఆర్ఎస్ అభ్యర్థులు పరస్పర సహకారంతో పనిచేసి అపూర్వ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళికను రూపొందించి, ప్రజల ఆమోదంతో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. తాము గెలిస్తే గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేస్తామో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీలు ఎండపల్లి ప్రసాద్, పెరుమళ్లపల్లి మోహన్ రావు, సీపీఎం జిల్లా నేత నంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్, సీపీఎం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

**బూర్గంపహాడ్ మహా:** ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని అన్ని పార్టీల నాయకులకు కార్యకర్తలకు ఎస్ఐ మేడాప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని సారపాక ప్రధాన కూడలిలో శుక్రవారం సాయంత్రం అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతా లను ఇప్పటికీ గుర్తించమని ఎన్ని కల నిర్వహణ పగడ్బందీగా నిర్వహించే ందుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై నాగ బిక్షం ,సిబ్బంది, అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# రెండవ రోజు అంతంత మాత్రమే నామినేషన్

**బూర్గంపహాడ్ మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బూర్గంపహాడ్ మండలంలో రెండవ రోజు శుక్రవారం అంతంత మాత్రమే నామినేషన్లు దాఖలు అయ్యాయి.ముహూర్తం బాగాలేదని రోజు బాగాలేదని అభ్యర్థులకు సరైన పత్రాలను సరి చూసుకునేందుకు సమయం కోసమని ఇలా ఏదో ఒక కారణం చేత మండలంలోని 18 గ్రామ పంచాయతీలల్లో సగానికి పైగా గ్రామపంచాయతీల సర్పంచుల నామినేషన్ లు దాఖలు చేయలేదు. రెండవ రోజు సర్పంచ్ అభ్యర్థులు 15 వార్డు సభ్యుల అభ్యర్థులు 38 మంది మండల వ్యాప్తంగా ఉన్న మండల వ్యాప్తంగా ఉన్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్లు దాఖలు చేశారు. బూర్గంపహాడ్ 3, ముసలిమడుగు 4, లక్ష్మీపురం 1,సారపాక 3, పినపాక పట్టి నగర్1, నకిరపేట 1, తాళ్ల గొమ్మూరు 1, కృష్ణసాగర్ 1 చొప్పున సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. నాగినేని ప్రోలు, మొరంపల్లి బంజర ఉప్పు సాక, ఇరవెండి, టేకుల చెరువు, మోతె పట్టి నగర్, సోంపల్లి, అంజనాపురం ,వేపలగడ్డ, కోయగూడెం, సర్పంచ్ అభ్యర్థులకు నామినేషన్ వేయలేదు. వార్డు సభ్యులుగా బూర్గంపహాడ్ 1, ముసలిమడుగు 2 ,లక్ష్మీపురం 7, సారపాక 15 ,పినపాక పట్టి నగర్1, నాగినేని ప్రోలు1, నకిర పేట4, కృష్ణ సాగర్ 6, సోంపల్లి 1 చెప్పును చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. నేడు ఆఖరి రోజు కావడంతో ఉదయం నుంచి గ్రామపంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు వాటి సభ్యుల నామినేషన్లు కోలాహలంగా ఉండొచ్చు అని మండల ఎన్నికల అధికారి జమలారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నామినేషన్ వేసే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి గ్రామ పంచాయతీలలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు సరైన పత్రాల తో నామినేషన్ వేయాలని ఎటువంటి అభ్యంతరమున్న ముందు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు అభ్యర్థులకు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. నాగినేనిప్రోలు ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని అదనపు ఎస్ఐ నాగబిక్షం సందర్శించారు.

# స్థానిక సంస్థల నామినేషన్ రెండవ రోజు మణుగూరులో

**మణుగూరు, మహా :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రెండవ రోజు నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. రెండో రోజు మణుగూరు మండలంలోని 14 పంచాయతీలకు గాను నామినేషన్ల స్వీకరణకు ఎనిమిది గ్రామపంచాయితీ నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 10 గ్రామపంచాయితీలకు 14 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానాలకు తమ నామినేషన్లను సమర్పించారు. 11 గ్రామపంచాయితీలల్లోని వార్డులకు గానూ మొత్తం 72మంది తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ గడువు శనివారంతో పూర్తి కానుండడంతో శనివారం ఆశావహులంతా తమ నామినేషన్లను సమర్పించనున్నారు. రాజకీయపార్టీల పొత్తులు తుది దశకు చేరకపోవడంతో ఆశావహుల్లో గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. పలు పంచాయితీల్లో వార్డులకు పోటీ చేసేందుకు సైతం అభ్యర్థులు ముందుకు రావడం లేదని పలు పార్టీల నాయకులు వాపోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాష్ట్ర స్థాయి నుండి స్పష్టమైన ఆదేశాలు రావడంతో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. కాగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ పార్టీల మధ్య సయోధ్య కుదిరిందన్న సమాచారం తెలిసింది. పొత్తుల్లో భాగంగా రామానుజ వారం తిర్లాపురం పంచాయతీలను సిపిఐ కి ఇచ్చేటట్లుగా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సమితి సింగారం పంచాయతీలో బిఆర్ఎస్, టిడిపి, సిపిఎం పార్టీలు పొత్తు కుదుర్చుకున్నట్లు సమాచారం.



# బరి తెగించిన ఇసుక మాఫియా

**మహా,భద్రాద్రి కొత్తగూడెం:** ములుగు జిల్లా వెంకటాపురం మండలం అబ్బాయిగూడెంలోని ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా రహదారిపై బైఠాయించి నిరసనకు దిగిన గిరజనులు, ఇతర గ్రామస్తులు ఇసుక లారీల వల్ల పంట పొలాలు, రోడ్లు నాశనం అవుతున్నాయని, వెంటనే ఇసుక రీచ్ ఆపాలని గ్రామస్తుల డిమాండ్ గ్రామస్తులపై ఇసుక సొసైటీ సభ్యులు చేసిన దాడిలో గాయపడిన మహిళ, బాధిత మహిళను ఆసుపత్రికి తరలించిన స్థానికులు ములుగు జిల్లా కలెక్టర్ ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, ప్రభుత్వ పెద్దలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు





# రాష్ట్రంపై స్క్రబ్ పంజా

- ఏజెన్సీ నుంచి సిటీ దాకా విస్తరించిన విష జ్వరాలు!
- అడవి బిడ్డలను వణికిస్తున్న విష జ్వరాలు
- ఆసుపత్రుల్లో పెరుగుతున్న సీరియస్ కేసులు
- పల్లెల్లో 'వింత జ్వరం'.. అసలు కారణం ఆ చిన్న కీటకమే!
- వ్యాధి ముదిరాక వస్తున్న బాధితులు.. కోలుకోవడం కష్టమంటున్న వైద్యులు

**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల నుంచి పట్నం వరకు ఇప్పుడు ఒకటే ఆందోళన మొదలైంది. ఇన్నాళ్లూ కేవలం గిరిజన గూడేలకే పరిమితమైందని భావించిన 'స్క్రబ్ టైఫస్' ఇప్పుడు మైదాన ప్రాంతాలను, పట్టణాలను కూడా వణికిస్తోంది. వర్షాలు తగ్గి చలికాలం ప్రవేశిస్తున్న వేళ, రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలు విలయతాండవం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఇది సాధారణ జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేస్తుండటం, సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు వస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రులకు క్యూ కడుతున్న బాధితుల సంఖ్యే ఈ వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది.

## ఉమ్మడి జిల్లాల్లో మోగిన డేంజర్ బెల్స్

రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే.. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఈ వ్యాధి ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న కుమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో గిరిజన రైతులు, అటవీ ఉత్పత్తులు సేకరించే కూలీలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అడవిలో లేదా పొలాల్లో పనికి వెళ్లినప్పుడు అక్కడ పొదల్లో ఉండే చిన్న నల్లి (మైట్స్) కుట్టడం వల్లే ఇది వేగంగా వ్యాపిస్తోంది. అటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా కేసులు గణనీయంగా నమోదవుతున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వస్తున్న జ్వరపీడితుల్లో పది శాతానికి పైగా స్క్రబ్ టైఫస్ లక్షణాలతోనే వస్తున్నారని, వీరిలో చాలామంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంటోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇక ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఏజెన్సీ మండలాల్లోనూ పరిస్థితి దారుణంగా ఉంది.

## నగర శివారుల్లోనూ కలకలం

ఒకప్పుడు కేవలం అటవీ ప్రాంతాలకే పరిమితమైన ఈ వ్యాధి, ఇప్పుడు తన రూపు మార్చుకుంది. నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతం, నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా కేసులు నమోదవుతున్నాయి. ఆశ్చర్యకరంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ అక్కడక్కడా కేసులు వెలుగుచూస్తుండటం గమనార్హం. నగర శివారుల్లోని ఫామ్ హౌస్‌లు, తోటల్లో పనిచేసే వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని గాంధీ, ఫీవర్ ఆసుపత్రులకు జిల్లాల నుంచి రిఫర్ అయి వస్తున్న కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చాలామంది రోగులు ఊపిరితిత్తుల సమస్యలు, కిడ్నీ వైఫల్యం, లేదా కోమా స్థితికి చేరుకున్న తర్వాతే పెద్ద ఆసుపత్రులకు చేరుకుంటుండటం వైద్యులకు పెద్ద సవాలుగా మారింది.

### మిస్టరీ ఫీవర్ కాదు.. ఆ చిన్న కీటకమే కారణం

ఈ వ్యాధి విషయంలో జరుగుతున్న ప్రధాన పొరపాటు 'అవగాహన లోపం'. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో దీనిని ప్రజలు 'వింత జ్వరం'గా లేదా 'మిస్టరీ ఫీవర్'గా పొరబడుతున్నారు. డెంగ్యూ, మలేరియా పరీక్షలు నెగెటివ్ వచ్చినా జ్వరం తగ్గకపోవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిజానికి స్క్రబ్ టైఫస్ వ్యాపించడానికి కారణమైన కీటకం (మైట్) కుట్టిన చోట శరీరంపై ఏర్పడే 'నల్లటి మచ్చ' ను గమనించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ మచ్చను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స చాలా సులభం. కానీ అది గమనించకుండా, జ్వరం ముదిరి మల్టీ ఆర్గాన్ వైఫల్యానికి దారితీస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఇది ఒక పెద్ద ఆరోగ్య సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### అప్రమత్తతే శ్రీరామరక్ష.. ప్రభుత్వ చర్యలు ముఖ్యం

ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే స్క్రబ్ టైఫస్‌ను గుర్తించే ర్యాపిడ్ టెస్ట్ కిట్లను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తే తప్ప ఈ ముప్పు నుంచి ప్రజలను కాపాడలేం. జ్వరం వచ్చి తగ్గకపోతే అది స్క్రబ్ టైఫస్ కావొచ్చనే అనుమానంతో వైద్యం అందించాలని, వింత జ్వరమని భయపడవద్దని వైద్యారోగ్య శాఖ సూచిస్తోంది. ముఖ్యం గా వ్యవసాయాధారిత జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం ఉన్నా, శరీరంపై నల్లటి మచ్చలు కనిపిస్తే వెంటనే పెద్ద ఆసుపత్రు లను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.



# సంజీవరావు సేవలు అపూర్వం

**మణుగూరు, మహా:** గిరిజన ప్రాంతాల్లో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు విశేష సేవలు అందిస్తున్న మణుగూరు ఏరియా ఆసుపత్రి ఆప్తాల్మిక్ ఆఫీసర్ గంజికుంట్ల సంజీవరావుకు అత్యుత్తమ సేవా పురస్కారం లభించింది. రికార్డు స్థాయిలో కంటి చికిత్సలు, శస్త్రచికిత్సలు నిర్వహించి ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపిన ఆయన సేవలను పురస్కరించుతూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, టీవీవిపి కమిషనర్, తెలంగాణ డాక్టర్ అజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరిగింది. పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో సంజీవరావు ఆధ్వర్యంలో 1628 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. నిరుపేదల ఆరోగ్య సంరక్షణలో అపూర్వమైన సేవలు అందిస్తూ రికార్డు స్థాయిలో శస్త్రచికిత్సలు చేయించడం విశేషమని అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుతో పాటు పలువురు వైద్యాధికారులు శుక్రవారం సంజీవరావు సేవలను ప్రశంసించారు.

# ఎన్నికల విధులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి

**ఖమ్మం,మహా:** ఎన్నికల విధులను అధికారులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఎంసిఎంసి సెల్, మీడియా సెంటర్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల కమీషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని, నిబంధనలను రూపొందించిందని వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయడం మన కర్తవ్యమని అన్నారు.





# నేటి బీఆర్ఎస్ దీక్షా దివాస్‌కు అధిక సంఖ్యలో తరలిరండి

**పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నిర్వహించ తలపెట్టిన దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపునిచ్చారు.ఆయన శు క్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన ప్రాణాలే ఫణంగా పెట్టి ఒక దృఢ సంకల్పంతో కేసీఆర్ దీక్షకు దిగిన రోజు దీక్షా దివస్ 2025 దీక్షా దివస్ సందర్భంగా, నవంబర్ 29 నుంచి డిసెంబర్ 09 వరకు తెలంగాణ ఉద్యమంలోని నాటి జ్ఞాపకాలు, అనుభూతులు, పోరాట సన్నివేశాలను గుర్తు చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో నేను" అనే ట్యాగ్ లైన్‌తో Telangana UdyamamloNenu హ్యాష్‌ట్యాగ్ వాడుతూ... నాటి మీ ఫోటోలను, అనుభవాలను ఈ 11 రోజుల పాటు మీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పంచుకోవాలని సూచించారు. అలాగే

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల మొదటి విడతలో ఎన్నికలు జరిగే మండలాల వారు ఈ కార్యక్రమానికి రావలసిన అవసరం లేదు. రెండవ విడత, మూడవ విడతలలో జరిగే మండల వారు ఈ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కోరారు. అలాగే ప్రస్తుతం ఎన్నికలు లేని పట్టణాలలోని, మున్సిపాలిటీలోని పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని , జిల్లాలోని మాజీ శాసనసభ్యులు, అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, ప్యాక్స్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఈ దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

